
# రష్యాలో రామయ్య కథ



పూర్వము రష్యాలో రామయ్య అనే రైతు ఉండేవాడు. ఓ మాయదారి మారయ్యకి నాలుగొందలు అప్పివ్వడానికి ఒడిగట్టి, మర్నాడు పంచాయితీ దగ్గిరకొస్తే కాయితం రాసుకు నగదు పుచ్చుగుందుగాని రమ్మన్నాడు. మారయ్య అప్పులు తీర్చడని భయపడ్డ నలుగురు దుర్మార్గులు ఇది తెలిసి పంచాయితీ ఆఫీసు అరుగుముందు రామయ్య ఒక్కడూ కూర్చుని ఉండగా చూసి కొంచెం అసింటా కూర్చుని, ఈ ఊళ్లో ఎవరో వెర్రివెంగళాయ మారయ్యని నమ్మి అప్పెడుతున్నాట్ట, అంతకన్న డబ్బుని గొయ్యితీసి కప్పెట్టుకోరాదూ అని విడివిడిగా రామయ్యకే వినబడేలా అనుకుని లేచి చక్కాపోయార్ట. వరసగా ఇలా నలుగురు అనుకునేవరకు రామయ్యకి మతిచెడి మారయ్య రాగానే నే నివ్వనని చెప్పి లేచిపోయాట్ట. అప్పుడు ఊరివారూ మునసబూ అంతా సంతోషించార్ట. రామయ్యకి గొప్ప ప్రమాదం తప్పిందిట. చెప్పుడు మాటలు వినడంవల్లనేగదా ఆహా అనుకున్నారుట.

చీమ హఠాత్తుగా కథ ఆపేసి చుట్టూ చూసింది. మిగతా చీమలన్నీ తనకేసి భయంకరంగా చూస్తున్నాయి. నాగలక్ష్మి, సుబ్బన్న విరగబడి నవ్వుకున్నారు.

చీమ నాలిక్కొరుచుకుంది. ఓహో తప్పుకథ చెప్పాను కాబోలు లేదా కథ తప్పుచెప్పి వుంటాను. పొరబాటు అంది.

కథేకాదు. నువ్వు మాటాడ్డమే పొరబాటు. అసలు నువ్వే పెద్ద పొరబాటు అన్నాడు సింహాద్రి కోపంగా.

* * *